



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ గరిమా అగ్రవాల్

## నీటి కొరత లేకుండా చూడాలి

● అదనపు కలెక్టర్ గరిమా అగ్రవాల్

సిద్దిపేట కలెక్టరేట్, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో నీటి కొరత లేకుండా చూడాలని అదనపు కలెక్టర్ గరిమా అగ్రవాల్ పేర్కొన్నారు. శనివారం ఐడీవోసీలోని మినీ సమావేశ మందిరంలో జిల్లా స్థాయి వాచ్‌డాగ్ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుత నీటి వనరులు తరిగిపోతున్న నేపథ్యంలో జిల్లా ప్రజలకు నీటి ఎద్దడి సమస్యలు తలెత్తకుండా కమిటీ పనిచేయాలని ఆదేశించారు. జిల్లాలో రెయిన్ వాటర్ హార్వెస్టింగ్‌పై సర్వే నిర్వహించాలన్నారు. భవన నిర్మాణాలకు అనుమతులు మంజూరు చేయడానికి ముందుగానే 300 చదరపు మీటర్ల కంటే ఎక్కువ ప్లాట్ ఏరియా ఉన్న అన్ని భవనాలు రెయిన్ వాటర్ హార్వెస్టింగ్ స్ట్రక్చర్ కలిగి ఉండాలన్నారు. అదేవిధంగా 10 వేల చదరపు మీటర్లు, అంతకంటే ఎక్కువ విస్తీర్ణంలో ఉన్న భారీ భవనాలలో, 100 అంతకంటే ఎక్కువ యూనిట్లు ఉన్న గ్రూప్ హౌస్‌లకు వ్యర్థ జలాల రీసైక్లింగ్ ప్లాంట్‌లను కలిగి ఉండేలా చూడాలన్నారు. వాచ్‌డాగ్ కమిటీలు క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ నీటి సంరక్షణ చర్యలు చేపట్టాలన్నారు. అవసరమైన చోట వాల్టా చట్టాన్ని అమలు చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీపీవో దేవకీదేవి, డీఆర్డీ పీడీ జయదేవ్‌ఆర్య, మిషన్ భగీరథ అధికారులు, మున్సిపల్ కమిషనర్‌లు పాల్గొన్నారు

## మీర్జాపూర్ హైస్కూల్ హెచ్‌ఎం సస్పెన్షన్

హుస్నాబాద్ రూరల్, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి) : పాఠశాల విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించిన మీర్జాపూర్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడిని సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయని డీటీఎఫ్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి టి.లింగారెడ్డి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. పాఠశాల పనివేళలు పాటించకపోవడం, సెల్‌ఫోన్‌ను ఎక్కువగా వాడడం, విద్యార్థులతో సొంత పనులు చేయించుకుంటూ బాధ్యతరహితంగా వ్యవహరించడంపై తల్లిదండ్రులకు హెచ్‌ఎం వేణుకుమార్‌పై విద్యాశాఖ అధికారులకు ఫిర్యాదు చేశారని పేర్కొన్నారు. ఆర్జేడీ వరంగల్ అధికారి విచారణ జరిపిన అనంతరం వేణుకుమార్‌ను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసినట్లు తెలిపారు.

## పిచ్చికుక్క స్వైర విహారం

ఏడుగురికి గాయాలు



కుక్క కరవడంతో బాలుడికి అయిన గాయాలు

మిరుదొడ్డి, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి) : పిచ్చికుక్క దాడిలో ఏడుగురికి గాయాలైన సంఘటన శనివారం మిరుదొడ్డిలో చోటుచేసుకున్నది. వివరాల్లోకి వెళితే.. మండల కేంద్రమైన మిరుదొడ్డి ఓ పిచ్చి కుక్క వీధుల వెంట తిరుగుతూ కనపడిన వారిపైకి ఎగబడింది. పిచ్చికుక్క దాడిలో గ్రామానికి చెందిన మొగుళ్ల రాజు, ఎల్లవ్వ, కుర్మ సత్తవ్వ, బానోదయ్, లోకేష్, ప్రశాంత్, మరొకరిని గాయపడ్డారు. వారిని మిరుదొడ్డి పీహెచ్‌సీకి తరలించి, చికిత్స అందించారు. అందులో ఇద్దరికి తీవ్రగాయాలవడంతో సిద్దిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అయితే, ఈ కుక్క అందరిపైకి ఎగబడుతుండడంతో గ్రామస్థులు చంపివేశారు.

సిద్దిపేట కేంద్రంగా అవతరించిన నాటి టీఆర్‌ఎస్.. ప్రస్తుత బీఆర్‌ఎస్ పార్టీ రజతోత్సవ సంబరాలకు సన్నద్ధమైంది. ఎమ్మెల్యేతోపాటు డిప్యూటీ స్పీకర్ పదవికి రాజీనామా చేసి 2001 ఏప్రిల్ 27న కేసీఆర్ తెలంగాణ రాష్ట్ర సమితికి పురుడుపోశారు. ఉప ఎన్నికతో సిద్దిపేట నుంచే సమరశంకాన్ని పూరించారు. నాటి నుంచి సిద్దిపేటతోపాటు ఉమ్మడి మెదక్ జిల్లా బీఆర్‌ఎస్‌కు వెన్నుదన్నుగా నిలిచింది. ఈ పాతికేళ్ల ప్రస్థానంలో ఎత్తుపల్లాల సంగతి పక్కనబెడితే నేటి రజతోత్సవ సంబరాల నేపథ్యంలో ఆ పార్టీ శ్రేణుల్లో జోష్ నెలకొన్నది.



సిద్దిపేటలో గులాబీ జెండాలతో ముస్తాబైన బీజేఆర్ చౌరస్తా

# రజతోత్సవ సంబురం

నేడు బీఆర్ఎస్ పార్టీ పాతికేళ్ల పండుగ

హనుమకొండ జిల్లాలో భారీ సభ

దారులన్నీ ఎల్కతుర్తికే

ఉమ్మడి మెదక్ జిల్లా నుంచి తరలనున్న శ్రేణులు

ఇప్పటికే సిద్దిపేట నుంచి బైలెల్లిన పాదయాత్ర

పటాన్‌చెరు నుంచి మొదలైన కార్ల ర్యాలీ

ఆంధ్రజ్యోతి ప్రతినిధి, సంగారెడ్డి, ఏప్రిల్ 26 : దారులన్నీ ఎల్కతుర్తికే అన్నట్లుగా బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు సమాయత్తమయ్యారు. ఆ పార్టీ ఆవిర్భవించి నేడు 25వ యేడులో అడుగుపెడుతున్నందున రజతోత్సవ సంబరాలు చేస్తున్నారు. ఇందులో భాగంగా ఈ సాయంత్రం హనుమకొండ జిల్లా ఎల్కతుర్తిలో నిర్వహించనున్న భారీ బహిరంగ సభకు వెళ్లేందుకు సిద్ధమయ్యారు. బీఆర్ఎస్ పార్టీ పురిటిగడ్డగా భావించే మెతుకుసీమ నుంచి భారీగా జనసమీకరణ చేయాలని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు ప్రత్యేక దృష్టి సారించారు. ఉమ్మడి మెదక్ జిల్లా నుంచి లక్ష మందికిపైగానే కార్యకర్తలు, ప్రజలను తరలించేందుకు ఏర్పాట్లు చేశారు.



పటాన్‌చెరు నుంచి కార్ల ర్యాలీని ప్రారంభిస్తున్న హరీశ్‌రావు

### పాదయాత్రలు.. కార్ల ర్యాలీలు

రజతోత్సవ వేడుక నేపథ్యంలో శుక్రవారం సిద్దిపేట నుంచి దాదాపు వెయ్యి మంది యువకులు, విద్యార్థులు చేపట్టిన పాదయాత్ర నేడు ఎల్కతుర్తికి చేరుకుంటుంది. 65 కిలోమీటర్ల దూరం పాదయాత్ర సాగిస్తున్న క్రమంలో వారికి ఎక్కడికక్కడ వసతులు ఏర్పాటు చేశారు. మాజీ మంత్రి హరీశ్‌రావు పాదయాత్రను ప్రారంభించడమే గాకుండా శనివారం రోజున మరోసారి పాదయాత్రను సందర్శించారు. పటాన్‌చెరు నియోజకవర్గ బీఆర్ఎస్ నేతల ఆధ్వర్యంలో 25 కార్లతో శనివారం ఉదయం ర్యాలీ బయల్దేరింది. రజతోత్సవ సభకు ఇటు పాదయాత్ర, అటు అంబాసిడర్ కార్ల ర్యాలీ ఆకర్షణగా నిలిచాయి. అదే విధంగా ఎడ్లబండ్లు, ట్రాక్టర్లు, దిచక్రవాహనాలతో నేడు ర్యాలీగా బయల్దేరడానికి బీఆర్ఎస్ పార్టీ అభిమానులు ఏర్పాట్లు చేసుకుంటున్నారు.

### జనాన్ని కదిలించేలా..

ఓ పక్క ఎండలు మండుతున్న క్రమంలో జనసమీకరణపై పార్టీ శ్రేణులు సందేహం మిగతా 7వ పేజీలో



## తాటికల్లు.. ముంజల బజ్జీలు

ఆహా.. పసందైన రుచి 7

## గొంగడి గోస..

కనుమురుగైన కంబళి.. చిన్నబోతున్న మగ్గాలు

సందడి లేని సరిగూటాలు 7







# వేసవిలో విజ్ఞానం

## సర్కారు పాఠశాలల్లో సమ్మర్ క్యాంప్‌లు

తొలిసారి విద్యాశాఖ శ్రీకారం

నైపుణ్యం, సామర్థ్యాలు, ఆటల్లో శిక్షణ

బడుల బలోపేతమే లక్ష్యం

పిల్లల సంఖ్య పెంచేందుకు చర్యలు

కొండపాక, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి) : పిల్లల కోసం వేసవి శిబిరాలు (సమ్మర్ క్యాంప్‌లు) అంటే.. ఇప్పటివరకు కార్పొరేట్ స్కూళ్లు, ప్రైవేటు ఇన్‌స్టిట్యూషన్‌లలు మాత్రమే నిర్వహించేవి. అవీ హైదరాబాద్, జిల్లా కేంద్రాల్లోనే ఎక్కువగా కొనసాగేవి. ప్రభుత్వం ఏర్పాటు చేసినా బాలభవన్‌లో నిర్వహిస్తుండేవారు. కానీ, ఈసారి ప్రభుత్వ బడుల్లో ఏర్పాటు చేయడం.. అదీ ప్రతీ మండలంలోనూ రెండు మూడు పాఠశాలల్లో ప్రారంభించడం విశేషం. విద్యార్థులకు విజ్ఞానంతో పాటు సర్కారు పాఠశాలల బలోపేతమే లక్ష్యంగా తొలిసారిగా విద్యాశాఖ ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది.

### 80 పాఠశాలల్లో శిబిరాలు

జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో సమ్మర్ క్యాంపులను నిర్వహించాలని సూచించడంతో ప్రభుత్వ ఉపాధ్యాయులు ముందుకొచ్చారు. ఇప్పటికే గురు, శుక్రవారాల్లో పలు పాఠశాలల్లో మిగతా 8వ పేజీలో



### సమ్మర్ క్యాంపులతో సృజనాత్మకత

సమ్మర్ క్యాంపులతో విద్యార్థుల సృజనాత్మకత పెంపొందుతుంది. ప్రతీ రోజు ఒక కార్యక్రమంతో విద్యార్థులకు పలు అంశాలను అందజేస్తున్నాం. విజ్ఞానంతో పాటు వినోదం అందుతుంది. చేతిరాత, చిత్రలేఖనం, ఆటలు, పాటలను నేర్పిస్తూ విద్యార్థులను చలాకీగా ఉండేలా చూస్తున్నారు.

\- పురుమాండ్ల రవీందర్‌రెడ్డి, హెచ్‌ఎం, అందే ప్రాథమిక పాఠశాల

Sunday Special

### స్వచ్ఛందంగా నిర్వహణ

జిల్లాలోని పలు పాఠశాలల ఉపాధ్యాయులు స్వచ్ఛందంగా ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తూ బలోపేతానికి కృషి చేస్తున్నారు. ముందస్తు బడిబాట సమ్మర్ క్యాంపులు జిల్లాలోని పలు పాఠశాలల్లో విజయవంతంగా జరుగుతున్నాయి. విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొంటున్నారు. నాణ్యమైన విద్య కోసం ప్రైవేటులో చేర్పించి నానా కష్టాలు పడకుండా తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలోనే చేర్పించాలి.

\- బేతి భాస్కర్, క్వాలిటీ సెల్ కోఆర్డినేటర్, విద్యాశాఖ

## ఉక్కుపాదంతో అణచివేయాలి

● గంజాయి, ఇతర మత్తు పదార్థాల వినియోగంపై నిఘాను పెంచాలి : సీపీ డాక్టర్ బి.అనురాధ



మాట్లాడుతున్న సీపీ అనురాధ

సిద్దిపేట క్రైం, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి) : గంజాయి ఇతర మత్తు పదార్థాల వినియోగంపై నిఘా పెంచాలని, ఉక్కుపాదంతో అణచివేయాలని సీపీ డాక్టర్ బి.అనురాధ సూచించారు. శనివారం ఆమె సిద్దిపేట డివిజన్ అధికారులతో కమిషనర్ కార్యాలయంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎస్‌వోపీ ప్రకారం గంజాయి కేసులు ఇన్వెస్టిగేషన్ చేయాలని ఆదేశించారు. ప్రజలకు డ్రగ్స్ నివారణ, గంజాయి, సైబర్ నేరాలు తదితర అంశాలపై అవగాహన కల్పించాలని సూచించారు. ఫోక్సో, ఎస్సీ, ఎస్టీ కేసులను 60 రోజుల్లో విచారణ పూర్తి చేసి చార్జిషీట్ దాఖలు చేయాలన్నారు. పోక్సో కేసులలో దరఖాస్తు రాగానే ఎలాంటి జాప్యం లేకుండా విచారణ జరిపి కేసు నమోదు చేసి పరిశోధన ప్రారంభించాలని సూచించారు. సీసీటీఎన్ఎస్ వర్షన్-2 నూతన సాంకేతికతపై పోలీస్ అధికారులు, సిబ్బందికి తప్పకుండా అవగాహన ఉండాలన్నారు. దర్యాప్తులో ఉన్న కేసులను అన్ని కోణాల్లో సాంకేతికను ఉపయోగించి కొలిక్కి తీసుకురావలని సూచించారు. రోడ్డు ప్రమాదంలో మరణించిన కేసుల్లో టెక్నాలజీ, సీసీ కెమెరాల ద్వారా వాహనాలను ట్రేస్ అవుట్ చేయాలని సూచించారు. పెట్రోలింగ్ విజిబుల్ పోలింగ్ గ్రామాలను నిరంతరంగా సందర్శించాలన్నారు. గ్రామస్థులతో మమేకమై వారి సాధకబాధకాలు విని, సమస్యలను పరిష్కరించే విధంగా కృషి చేయాలన్నారు. గ్రామాల్లో సీసీ కెమెరాల ఏర్పాటుపై అవగాహన కల్పించాలని సీపీ తెలిపారు. ప్రతీ పోలీస్‌స్టేషన్ పరిధిలో అనుమానితులు, పాత నేరస్తులను పోలీస్‌స్టేషన్‌కు పిలిపించి కౌన్సెలింగ్ నిర్వహించాలని, వారి కదలికలపై నిఘా పెంచాలని సీపీ ఆదేశించారు. రెవెన్యూ అధికారులతో కలసి ప్రతీ నెల చివరి రోజున సివిల్ రైట్స్‌డే నిర్వహించాలన్నారు. ఈ సమావేశంలో సిద్దిపేట ఏసీపీ మధు, టాస్క్‌ఫోర్స్ ఏసీపీ రవీందర్, ఇన్‌స్పెక్టర్లు విద్యాసాగర్, వాసుదేవరావు, సీఐలు, శ్రీను, శ్రీనివాస్, సీసీఆర్బీ ఇన్‌స్పెక్టర్ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



## పహల్గాం మృతులకు నివాళి

జమ్ము కశ్మీర్‌లోని పహల్గాంలో జరిగిన ఉగ్రదాడిలో మృతిచెందిన పర్యాటకులకు శనివారం చిన్నకోడూరు మండలం గోనెపల్లిలో గ్రామంలో యువకులు, చిన్నారులు నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు గ్రామంలోని ప్రధాన వీధుల గుండా కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు.

\- చిన్నకోడూరు, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి)





## విరిగిపడిన ధ్వజస్తంభం

సిద్దిపేట రూరల్ మండలంలో శుక్రవారం సాయంత్రం ఈదురుగాలుల వర్షం బీభత్సం సృష్టించింది. గాలివానకు చింతమడక గ్రామంలోని పట్టాభి రామచంద్రస్వామి ఆలయం ధ్వజస్తంభం విరిగిపడింది.

\- సిద్దిపేట రూరల్, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి)

## భూ భారతితో భూముల లెక్క పక్కా

● త్వరలో సాదాబైనామాలకు పరిష్కారం

● కలెక్టర్ మనుచౌదరి

కుకునూరుపల్లి, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి) : భూ భారతి పోర్టల్‌తో భూముల లెక్క పక్కాగా ఉంటుందని కలెక్టర్ మనుచౌదరి తెలిపారు. కుకునూరుపల్లి రైతు వేదికలో శనివారం ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. త్వరలో సాదాబైనామాలకు పరిష్కారం లభిస్తుందన్నారు. సంవత్సర కాలంగా వివిధ రంగాల మేధావులు, ప్రజలు, రైతుల సలహాలు సూచనలతో ఏర్పాటు చేసిన చట్టమే భూభారతి అన్నారు. ఏప్రిల్ 14 నుంచి అమలులోకి వచ్చిందన్నారు. కోర్టుకు వెళ్లకుండానే భూభారతితో సమస్యలు పరిష్కారం అవుతాయని, నిరుపేదలకే అసైన్డ్ భూములు చెందుతాయని తెలిపారు. భూములకు సంబంధించిన వివరాలను కావాలనుకునే రైతులు ఎమ్మార్వో వద్ద దరఖాస్తు చేసుకుంటూ అన్ని వివరాలను అందజేస్తామని తెలిపారు. పలువురు పలు సమస్యలను కలెక్టర్‌కు వివరించగా వాటికి ఆయన సమాధానం ఇచ్చారు. అంతకుముందు అదనపు కలెక్టర్ అబ్దుల్‌హమీద్ రైతులకు మరియు వివిధ పార్టీల నాయకులకు భూభారతిపై గంటపాటు అవగాహన కల్పించారు. భూభారతి అవగాహన సదస్సులో వసతుల ఏర్పాట్లలో రెవెన్యూ అధికారులు విఫలమయ్యారు. ఊహించిన దాని కంటే ఎక్కువగా ప్రజలు రావడంతో తీవ్రంగా ఇబ్బందులను ఎదుర్కొన్నారు.





### భూ సమస్యలకు చెక్

కొండపాక, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి) : భూభారతి చట్టంతో భూ సమస్యలకు పరిష్కారం లభిస్తుందని కలెక్టర్ ఎం.మను చౌదరి అన్నారు కొండపాకలో శనివారం భూభారతి చట్టంపై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయన ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇంతకు ముందు ఉన్న లోటుపాట్లను దృష్టిలో పెట్టుకుని భూ భారతిని రూపొందించినట్లు తెలిపారు. అదనపు అబ్దుల్ హమీద్ చట్టంలోని అంశాలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. సమావేశంలో ఆర్డీవో చంద్రకళ, మార్కెట్ కమిటీ చైర్మన్ విరుపాక్ష శ్రీనివాస్‌రెడ్డి, మండల స్పెషల్ ఆఫీసర్ నాగరాజు, తహసీల్దార్ దిలీప్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రాణం తీసిన ఈత సరదా

- బావిలో నీట మునిగి యువకుడి మృతి
- ఏడాది క్రితం అప్పుల బాధతో తండ్రి ఆత్మహత్య

మద్దూరు, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): ఏడాది క్రితం తండ్రి ఉరేసుకుని చనిపోగా, ప్రస్తుతం కొడుకు ప్రమాదవశాత్తు నీట మునిగి మృతి చెందడం ఆ కుటుంబాన్ని తీవ్ర విషాదంలోకి నెట్టింది. బంధువుల ఇంటికి వెళ్లిన యువకుడు వారితో సరదాగా ఈత కొట్టేందుకు వెళ్లి బావిలో దూకడంతో ఈత రాక నీట మునిగి మృతి చెందాడు. ఈ విషాద ఘటన మద్దూరు మండలంలోని సలాఖ్‌పూర్‌లో శనివారం చోటు చేసుకున్నది. బంధువులు తెలిపిన వివరాల ప్రకారం.. మద్దూరు మండలంలోని మర్మాముల గ్రామంలోని జంగలి రాజు ఇంట్లో గత గురువారం ఎల్లమ్మ పండుగ చేసుకోగా, చేర్యాలలోని పెద్దమ్మ గడ్డకు చెందిన అతడి మేనమామ కొడుకు బింగి అఖిల్(19) తన తల్లితో కలిసి వచ్చాడు. పండుగ అనంతరం వచ్చిన బంధువులు, స్నేహితులు పక్క గ్రామమైన సలాఖ్‌పూర్‌లోని చెరువు కట్ట కింద గల షైబాయిలో ఈత కొట్టేందుకు వెళ్తుండగా అఖిల్ సైతం వారితో పాటే వెళ్లాడు. ఈత కొట్టేందుకు బావిలోకి దూకిన అఖిల్‌కు సరిగా ఈత రాక ప్రమాదవశాత్తు నీట మునిగి మృతి చెందాడు. అఖిల్‌ను కాపాడేందుకు బంధువులు తీవ్రంగా యత్నించినా ఫలితం లేకుండా పోయింది. ఈ సమాచారమందుకున్న మద్దూరు పోలీసులు ఘటనాస్థలానికి వెళ్లి బావిలో నుంచి అఖిల్ మృతదేహాన్ని బయటకు తీయించారు. గత ఏడాది తండ్రి బింగి యాదగిరి అప్పుల బాధతో ఉరేసుకుని బలవన్మరణానికి పాల్పడగా, నేడు కొడుకు ప్రమాదవశాత్తు మృతి చెందడంతో ఆ కుటుంబం దుఃఖసాగరంలో మునిగింది. మృతుడికి తల్లి కవిత, అక్క ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్టు ఎస్ఐ షేక్ మహబూబ్ తెలిపారు.


మృతి చెందిన అఖిల్

## అప్పుల బాధతో యువకుడు బలవన్మరణం

చేగుంట, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): అప్పుల బాధతో యువకుడు ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ సంఘటన నార్సింగి మండలం జప్తి శివనూరు గ్రామ శివారులో శనివారం చోటు చేసుకున్నది. నార్సింగి ఎస్ఐ అహమ్మద్ మైనుద్దీన్, గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. నిజాంపేట మండలం చల్మెడ గ్రామానికి చెందిన తుడుం సుధాకర్(35)కు నాలుగేళ్ల క్రితం జప్తి శివనూర్ గ్రామానికి చెందిన అరుణతో వివాహం జరిగింది. అరుణకు తల్లిదండ్రులు లేకపోవడంతో మేనమామలే పెళ్లి జరిపించారు. నాటి నుంచి సుధాకర్ దంపతులు అత్తగారి ఊరు అయిన జప్తి శివానూర్‌లో వ్యవసాయం చేసుకుంటూ జీవిస్తున్నారు. ఈ క్రమంలో చల్మెడ గ్రామంలో వ్యవసాయం కోసం మహిళా సంఘాల గ్రూపులో అప్పు తీసుకున్నారు. అయితే పొలం ఎండిపోవడంతో అప్పులు తీర్చే మార్గం లేక మనస్థాపం చెందిన సుధాకర్ వ్యవసాయ పొలం వద్ద చెట్టుకు తాడుతో ఉరేసుకొని బలవన్మరణం చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు నార్సింగి పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.


సుధాకర్(ఫైల్)

## అదృశ్యమైన వ్యక్తి మృతదేహంగా..

మిరుదొడ్డి, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): సుమారు 10 రోజుల క్రితం అదృశ్యమైన వ్యక్తి మృతదేహం శనివారం స్థానిక అటవీ ప్రాంతంలో లభ్యమైంది. ఎస్ఐ పరశురాములు తెలిపిన వివరాల ప్రకారం.. మిరుదొడ్డికి చెందిన వనం యాదయ్య(50) ఈ నెల 14న అదృశ్యమయ్యాడు. రెండు రోజుల పాటు గాలించినా ఫలితం లేకపోవడంతో కుటుంబీకులు పోలీసులకు ఫిర్యాదు చేయగా మిస్సింగ్ కేసు నమోదు చేశారు. ఈ క్రమంలో శనివారం మిరుదొడ్డి గ్రామశివారులోని అటవీప్రాంతంలో ఓ మృతదేహాన్ని గమనించిన కొందరు పోలీసులకు సమాచారమందించారు. పోలీసులు వెంటనే ఘటనాస్థలానికి చేరుకుని పరిశీలించి కుటుంబీలను రప్పించగా వారు యాదయ్య మృతదేహంగా గుర్తించారు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని దుబ్బాక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

## రేపు హత్నూరకు మంత్రుల రాక

హత్నూర, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): హత్నూరలో ఈ నెల 28వ తేదీన చేపట్టనున్న పలు అభివృద్ధి పనుల ప్రారంభోత్సవాలకు రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ, జిల్లా ఇన్‌చార్జి మంత్రి కొండా సురేఖ, హాజరు కానున్నట్టు తహసీల్దార్ ఫర్హీన్‌షేక్ తెలిపారు. శనివారం ఆమె తహసీల్ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్ దావూద్‌తో కలిసి వివరాలను వెల్లడించారు. అదేరోజు దౌల్తాబాద్‌లో నిర్వహించనున్న భూభారతి కార్యక్రమంపై అవగాహన సదస్సుకు మంత్రులతో పాటు ఎంపీ రఘునందన్‌రావు, ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి పాల్గొననున్నట్లు తెలిపారు.



# తాటికల్లు.. ముంజల బజ్జీలు

అక్కన్నపేట, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): వేసవి అంటేనే టక్కున గుర్తుకొచ్చేది తాటి ముంజలు. వీటిని ఆరగిస్తే ఎండ వేడిమి నుంచి ఉపశమనం పొందడంతో పాటు శరీరంలోని వేడిని తగ్గిస్తుందని చెబుతుంటారు. కల్తీ చేసేందుకు వీలు లేకపోవడం, ఆరోగ్యానికి మేలు చేస్తుండడంతో తాటి ముంజలకు కోనేందుకు జనం ఆసక్తి చూపుతున్నారు. వేసవిలో రోడ్డు పక్కన ముంజలను అమ్మడం చేశాం కానీ.. సిద్దిపేట జిల్లా అక్కన్నపేట మండలం గోవర్ధనగిరికి చెందిన ఆంజనేయులు తాటి ముంజలతో బజ్జీలు చేస్తూ విక్రయిస్తున్నాడు. హుస్నాబాద్ మండలం హన్మకొండ- సిద్దిపేట హైవే రహదారి పక్కన పందిళ్ల తాటి వనంలో అతడు ప్లేటుకు రూ.100 చొప్పున అమ్ముతున్నాడు. కల్లు ప్రియులు స్టఫ్‌గా వీటినే కొనుగోలు చేస్తున్నారు. కేవలం ఎండాకాలంలో నెలరోజులు మాత్రమే ఈ బజ్జీలు లభించనుండడంతో కల్లు ప్రియులతో పాటు అటుగా రాకపోకలు సాగించేవారు ఇష్టంగా కొని ఆరగిస్తున్నారు. ఆర్డర్ పై ముంజల బజ్జీలు చేస్తున్నట్లు ఆంజనేయులు తెలిపారు.





# గొంగడి గోస



## కనుమరుగైన కంబళి.. చిన్నబోతున్న మగ్గాలు

- ఉన్నినిచ్చే దక్కనీ గొర్రెలూ కరువు
- ఇతర పనులకు నేత గొల్లలు

నారాయణఖేడ్, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): అన్ని సీజన్‌లలో అన్ని వర్గాల వారు ఉపయోగించే కంబళ్ల నేత కార్మికులు కనుమరుగవుతున్నారు. గొల్ల కురుమలలో ఒక సామాజిక వర్గానికి చెందిన వారు గొర్రెలను మేపుకుంటూ వాటి ద్వారా తీసిన ఉన్నితో కంబళ్లను నేచి విక్రయించే వారు. గొర్రెల పెంపకం విధానంలో వచ్చిన మార్పు, ప్రభుత్వ ప్రోత్సాహకంఅందక పోవడంతో వారి కుటుంబాల పోషణ భారంగా మారింది దీంతో వారు ఇతర వృత్తుల వైపు మొగ్గుచూపుతున్నారు. నారాయణఖేడ్ ప్రాంతంలో గొల్ల కురుమలు చెప్పుకోదగ్గ స్థాయిలోనే ఉంటారు. దశాబ్దాలుగా నారాయణఖేడ్ మండలం గంగాపూర్, మనూరు మండలం ఎల్గోయి నాగల్‌గిద్ద మండలం కారముంగి, శాపూర్ గ్రామాలు కంబళ్ల నేతకు ప్రసిద్ధి. గంగాపూర్‌లోనే 60 కుటుంబాల వారు కంబళ్లను నేచి జీవించేవారు. గతంలో ఈ గ్రామాన్ని యునెస్కో బృందం కూడా సందర్శించింది. అప్పట్లో నూతన వస్త్రాధారణ సమయంలోనూ పుట్టు గొంగడి అంటూ చిన్నారులకు కంబళి కప్పేవారు. ప్రస్తుతం కంబళ్లు లభించక పోవడంతో శాలువాలతో సరిపెట్టుకుంటున్నారు. రైతులు కంబళ్లను తమ పంటను ఇంటికి తెచ్చుకోవడానికి, చలి వేస్తే వెచ్చగా ఉండడానికి, వానాకాలంలో తడవకుండా ఉండడానికి, ఎండాకాలంలో ఉక్కపోత నుంచి ఉపశమనం పొందడానికి కంబళ్లను వినియోగించేవారు.

### నాణ్యతను బట్టి ధర..

గతంలో కంబళి నాణ్యతను బట్టి రూ.500 నుంచి రూ.2000 వరకు విక్రయించే వారు. ప్రస్తుతం నాణ్యమైన కంబళి కావాలంటే రూ.10,000 వెచ్చించినా దొరకని పరిస్థితి. ఒక్క కంబళి నేయాలంటే 30 గొర్రెలను ఆరు



గంగాపూర్‌లో పూడ్చుకు పోయిన మగ్గం గొయ్యి

నెలల పాటు పోషించిన అనంతరం వాటి నుంచి తీసిన ఉన్నితో దారాన్ని వడికి, దాని ద్వారా కంబళి నేయాల్సి ఉంటుంది. ఒక్కో గొర్రెకు 200 గ్రాముల వరకు ఉన్ని లభించేది. ఈ విధంగా శ్రమపడి ఒక కంబళి నేయాలంటే, ఉన్ని తీసి శుభ్రం చేసి దారం తయారు చేసి నేయాలంటే 30 రోజులు పడుతుంది. ఇంత కష్టపడి కంబళి నేస్తే రూ.10000 వెచ్చించి ఎవ్వరూ కొనుగోలు చేయరు. ఈ కంబళి నేయడానికి పడే శ్రమను ఇతర పనులకు వినియోగిస్తే నెలలో రూ.20,000 పైగా సంపాదించవచ్చని, దీంతో గిట్టుబాటు కాక నేతను వదలాల్సి వస్తుందని కంబళి నేత కార్మికులు అంటున్నారు.

### లభించని ఉన్ని..

కంబళి నేయాలంటే నలుపురంగు ఉన్ని బాగుంటుంది. కానీ ప్రభుత్వం మాంసం కోసం తెలుపురంగు గొర్రెల పెంపకాన్ని ప్రోత్సహిస్తుండడంతో నాణ్యమైన ఉన్ని కూడా లభించడం లేదని వాపోతున్నారు. దీంతో వృత్తిని వదులుకుంటున్నట్లు నేత కారులు తెలుపుతున్నారు. ఖచ్చితంగా కంబళి కావాలనుకునే వారు కర్ణాటకలోని మైలారం వెళ్లి తెచ్చుకుంటున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి కళాత్మకమైన కంబళి నేత కార్మికులను ప్రోత్సహించి నేత కారులను ఆదుకోవాలని పలువురు కోరుతున్నారు.



ఉన్ని లేని తెలుపురంగు గొర్రెలు

### ఆదరించేవారు లేక వృత్తిని వదిలేశాను..



తమ కుటుంబీకులు తరాలుగా కంబళ్లను తయారు చేసేవారు. గతంలో కంబలి అవసరం ఉన్నవారు, ముందుగా ఆర్డర్ పెట్టి చేయించుకునేవారు. ప్రస్తుతం తెలుపురంగు గొర్రెల పెంపకంకు తోడు మార్కెట్లో కష్టపడి నేసిన కంబలికి గిట్టుబాటు ధర లభించడం లేదు. అందువల్ల వృత్తిని మానేసి ఇతర పనులు చేసుకుంటున్నాం.

**- తిప్పుగొండ, కంబళి నేత కార్మికుడు, గంగాపూర్**

### ప్రభుత్వం ప్రోత్సహిస్తే నేత ప్రారంభిస్తాం



తమ గ్రామంలో దాదాపు 60 కుటుంబాల వారు కంబలి కార్మికులుగా పని చేసేవారం. దాదాపు 100 గ్రామాలకు చెందిన వారు తమ గ్రామం నుంచి కంబళ్లను కొనుగోలు చేసేవారు. ప్రస్తుతం నెలకొన్న పరిస్థితుల వల్ల కంబళ్ల నేయకపోయినా ఆ వృత్తిపై ఉన్న మక్కువతో నేత పరికరాలను భద్రంగా దాచి ఉంచాం. ప్రభుత్వం కంబళ్లను నేయడానికి ప్రోత్సాహాన్ని ఇస్తే మళ్లీ నేత ప్రారంభిస్తాం.

**- నర్సుగొండ, కంబళి నేత కార్మికుడు గంగాపూర్**

## కూలీలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలి

- డీఆర్‌డీవో జయదేవ్ ఆర్యా

సిద్దిపేట రూరల్, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి) : వేసవిలో ఎండల తీవ్రత బాగా ఉందని, కూలీలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని డీఆర్‌డీవో జయదేవ్ ఆర్యా కూలీలకు సూచించారు. శనివారం సిద్దిపేట రూరల్ మండలం చింతమడక, పుల్లూరు, తోర్నాల గ్రామాల్లో ఉపాధి హామీ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా డీఆర్‌డీవో మాట్లాడుతూ కూలీలకు ఏప్రిల్ నుంచి రోజువారి కూలీ ప్రభుత్వం పెంచిందన్నారు. ప్రతి కూలీ రూ.307 గిట్టుబాటు అయ్యేలా పని చేయాలని సూచించారు. ఎండ తీవ్రత ఎక్కువ ఉన్నందున ఉదయం, సాయంత్రం వేళల్లోనే పని చేయాలన్నారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని ఎప్పటికప్పుడు మిల్లులకు తరలించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో హెచ్‌ఆర్ మేనేజర్ నరసింహరావు, డీపీఎం కరుణాకర్, ఎంపీడీవో మురళీధర్ శర్మ, ఏపీవో కిషన్ రాజు, ఏపీఎం విజయ నిర్మల, సీసీ రాజు గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## ఆలిండియా సాఫ్ట్‌బాల్ పోటీలకు ఎంపిక

మునిపల్లి, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి) : ఆలిండియా అంతర్ కళాశాలల సాఫ్ట్‌బాల్ పోటీలకు సంగారెడ్డి జిల్లా మునిపల్లి మండలం బుదేరా మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థినులు ఎంపికయ్యారు. హైదరాబాద్‌లోని నిజాం కళాశాలలో ఈ నెల 24న జరిగిన పోటీల్లో కళాశాలకు చెందిన రెబెకా, రాధిక, మీనాక్షి ప్రతిభ కనబర్చి ఎంపికైనట్లు కళాశాల ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ రమాదేవి తెలిపారు. మే 4 నుంచి 8వ వరకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నెల్లూరులోని విక్రమ సింహాపురి యూనివర్సిటీలో జరుగనున్న ఆలిండియా ఇంటర్ యూనివర్సిటీ సాఫ్ట్‌బాల్ టోర్నమెంట్‌లో వారు పాల్గొనున్నట్లు తెలిపారు. ఆ విద్యార్థినులను కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మాధవి, ఫిజికల్ డైరెక్టర్ రమాదేవి, అధ్యాపక బృందం అభినందించారు.

## ఇంటర్‌లో ఫెయిలైన విద్యార్థిని ఉరేసుకుని ఆత్మహత్య

హుస్నాబాద్, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి) : ఇంటర్ ఫెయిల్ అయ్యానన్న కారణంతో విద్యార్థిని ఆత్మహత్య చేసుకున్నది. వివరాలు ఇలా ఉన్నాయి. హుస్నాబాద్ పట్టణంలోని బీసీ కాలనీకి చెందిన దండవేని సంజన (16) ఇటీవల వెలువడిన ఇంటర్ ఫస్టియర్ ఫలితాల్లో ఫెయిలైంది. దీంతో మనస్తాపం చెందిన సంజన శనివారం రాత్రి ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నది. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తోట మహేశ్ తెలిపారు.

## క్రీడా శిక్షణ తరగతులకు దరఖాస్తులు

- మే 1 నుంచి జూన్ 6 వరకు శిబిరాలు
- జిల్లా యువజన క్రీడల అధికారి దామోదర్‌రెడ్డి

మెదక్‌అర్బన్, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): మెదక్ జిల్లాలోని 14 సంవత్సరాల లోపు బాలబాలికలకు ఉచిత వేసవి క్రీడల శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు జిల్లా యువజన క్రీడల అధికారి దామోదర్‌రెడ్డి తెలిపారు. మే 1 నుంచి జూన్ 6వ తేదీ వరకు బాలబాలికలకు కబడ్డీ, అథ్లెటిక్స్, ఖోఖో, వాలీబాల్, ఫుట్‌బాల్, బ్యాడ్మింటన్, హ్యాండ్‌బాల్ క్రీడల నందు శిక్షణ ఇవ్వనున్నట్లు వెల్లడించారు. జిల్లా వ్యాప్తంగా హావేళీఘణపూర్, అల్లాదుర్గం, కౌడిపల్లి, రామాయంపేట, చేగుంట, చిన్నశంకరంపేట, మాసాయిపేట, తూప్రాన్, మనోహరాబాద్, శివ్వంపేట ప్రాంతాల్లో క్రీడా శిక్షణ శిబిరాలు కొనసాగుతాయన్నారు. శిక్షణలో పాల్గొనదలచిన వారు సంబంధిత వెబ్‌సైట్‌లో ఈనెల 30లోపు పేర్లను నమోదు చేయించుకోవాలని సూచించారు.

## హెచ్‌ఎం కుమారుడికి సివిల్స్ ర్యాంకు

నర్సాపూర్, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): నర్సాపూర్ మండలం లింగాపూర్ ప్రాథమికోన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయురాలిగా పనిచేస్తున్న గుత్త నాగమణి కుమారుడు చరణ్‌తేజ్ సివిల్స్‌లో 231వ ర్యాంకు సాధించాడు. హెచ్‌ఎం నాగమణి భర్త హరినాథ్‌బాబు స్వస్థలం ఖమ్మం కాగా ఆ కుటుంబం ఉద్యోగరీత్యా హైదరాబాద్‌లోని కూకట్‌పల్లిలో స్థిరపడింది. చరణ్‌తేజ్ ఇంటర్ వరకు హైదరాబాద్‌లో చదువగా, 2017-2021లో ఐఐటీ ముంబయిలో ఇంజనీరింగ్ పూర్తి చేశాడు. అనంతరం తొమ్మిది నెలలపాటు జాబ్ చేసిన అతడు సివిల్స్ సాధించాలనే లక్ష్యంతో జాబ్ మానేసి ఇంటి వద్దే ఉంటూ ఆన్‌లైన్‌లో శిక్షణ తీసుకుని అనుకున్న లక్ష్యం సాధించాడు.



తల్లిదండ్రులతో చరణ్‌తేజ్

# దాహం..దాహం

- గడిపెద్దాపూర్‌లో నీటి ఎద్దడి
- 15 రోజులుగా అరకొర సరఫరా
- అవస్థలు పడుతున్న గ్రామస్థులు



గడిపెద్దాపూర్‌లో ఖాళీ బిందెలతో నిరసన వ్యక్తం చేస్తున్న కాలనీవాసులు (ఫైల్)

అల్లాదుర్గం, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో తాగునీటి సమస్యను పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం అధికారులను పదే పదే ఆదేశిస్తున్నా వారు పట్టించుకోవడంలేదు. దీంతో ప్రజలు దాహం.. దాహమంటూ నీటికోసం అల్లాడుతున్నారు. అల్లాదుర్గం మండలంలోని గడిపెద్దాపూర్‌లోని పలు కాలనీలలో పదిహేను రోజులుగా నీటి ఎద్దడి నెలకొన్నది. ప్రధానంగా గ్రామంలోని 3, 4, 5 వార్డులలో తాగు నీటి సమస్య శివతాండవం చేస్తుందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మిషన్ భగీరథ నీరు సైతం రెండుమూడు రోజులకోసారి సరఫరా కావడంతో జనం అల్లాడుతున్నారు. ఈ నెల 18న గ్రామాన్ని సందర్శించిన అదనపు కలెక్టర్ నగేష్ దృష్టికి ఈ విషయాన్ని తీసుకెళ్లినా పరిష్కారానికి చర్యలు తీసుకోకపోవడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా అధికారులు స్పందించి గ్రామంలో నెలకొన్న తాగునీటి సమస్య పరిష్కారం కోసం చర్యలు తీసుకోవాలని, లేకుంటే ఆందోళనను తీవ్రతరం చేస్తామంటు గ్రామస్థులు హెచ్చరిస్తున్నారు.

### పట్టించుకోని అధికారులు

తాగునీటి సమస్య పరిష్కరించాలని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ, గ్రామ ప్రత్యేకాధికారి రఘునాథ్ విన్నవిస్తే ప్రతీ ఇంటికి ప్రభుత్వ లెక్కలకు అదనంగా తాగునీటిని అందిస్తుంటే నీటి ఎద్దడి ఎలా నెలకొందని ఎదురు ప్రశ్నిస్తున్నారని గ్రామస్థులు మండిపడ్డారు. గ్రామంలో నాలుగు నీటి ట్యాంకులున్నాయని, వాటి ద్వారా ప్రతీ ఇంటికి 100 లీటర్లకు బదులుగా 180 లీటర్లను సరఫరా చేస్తున్నామంటూ లెక్కలు చెబుతున్నారన్నారు. మిషన్ భగీరథ నీటిని కూడా సరఫరా చేస్తున్నట్లు చెబుతున్నా క్షేత్రస్థాయిలో పరిస్థితి అందుకు భిన్నంగా ఉందన్నారు. ఆయన ఏ ఒక్క రోజు గ్రామానికి రాకపోగా.. తాగునీటి సమస్యను పట్టించుకోవడంలేదని మండిపడుతున్నారు. కాగా, గ్రిడ్ అధికారుల నిర్లక్ష్య వైఖరితోనే నీటి సమస్య తలెత్తుతుందని, దీనిపై వారికి విన్నవించినా పట్టించుకోవడం లేదని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ రఘునాథ్ ఆరోపిస్తున్నారు.

## వేతనాల కోసం కార్మికుల సమ్మె

- 27 గ్రామాలకు నీటి సరఫరా బంద్

కొండాపూర్, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి) : పెండింగ్ వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ మిషన్ భగీరథ నీటి సరఫరా కార్మికులు సమ్మె బాట పట్టారు. దీంతో రెండు రోజులుగా సంగారెడ్డి నియోజకవర్గం కొండాపూర్ మండలం పరిధిలోని 24 గ్రామాలు, సదాశివపేట మండలంలోని నాగుసాన్‌పల్లి, పెద్దాపూర్, ముబాకర్‌పూర్ గ్రామాలకు నీటి సరఫరా నిలిచిపోయింది. ఈ సందర్భంగా కార్మికులు మాట్లాడుతూ వేతనాల చెల్లింపుల్లో జీఆర్‌కే కాంట్రాక్ట్ యజమాన్యం నిర్లక్ష్యం వహిస్తుందన్నారు. 15 నెలల పెడింగ్ వేతనాలు చెల్లించాలని గత డిసెంబర్‌లో సంగారెడ్డి సెగ్మెంట్ పరిధిలోని జహీరాబాద్, సంగారెడ్డి, పటన్‌చెరు నియోజకవర్గాల్లో మూడు రోజులు నీటి సరఫరా నిలిపివేసి సమ్మె చేపట్టామన్నారు. దీంతో ఉన్నతాధికారులు, కాంట్రాక్టు యాజమాన్యం స్పందించి రెండు రోజుల్లో మొత్తం బకాయిలు చెల్లిస్తామని చెప్పి కేవలం రెండు నెలల వేతనాలు మాత్రమే చెల్లించారని ఆవేదన వ్యక్తం చేశారు. రూ.10వేల లోపు వేతనాలతో కుటుంబ పోషణ భారమై చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని తెలిపారు. టీఏ, డీఏలను తామే భరించాల్సిన పరిస్థితి నెలకొన్నదని, ఏళ్లుగా పనిచేస్తున్నా.. కనీసం ఈఐఎస్ఐ, పీఎఫ్ సౌకర్యం కల్పించడం లేదన్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి పెడింగ్ వేతనాలను ఇప్పించాలన్నారు. అలాగే పనికి తగ్గ వేతనంతోపాటు ఇతర సౌకర్యాలు కల్పించాలని కోరుతున్నారు.



మిషన్ భగీరథ పంప్ హౌస్ ఎదుట నిరసన తెలుపుతున్న కార్మికులు

## రెండు బైక్‌ల ఢీ.. ఆపై దూసుకెళ్లిన లారీ!

- ముగ్గురు అక్కడికక్కడే దుర్మరణం
- మృతుల్లో తండ్రి, ఐదేళ్ల కుమారుడు
- సెలవులకు ఇంటికొచ్చి ప్రాణాలు కోల్పోయిన ఎనిమిదేళ్ల పాప
- మృతుడి భార్య, కూతురికి తీవ్ర గాయాలు





మృతులు గోపాల్, అభినవ్ (ఫైల్)

నర్సాపూర్, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): ఆ రోడ్డు ప్రమాదం.. రెండు బైక్‌లు ఢీకొన్న వరకే పరిమితమై ఉంటే అందరూ గాయాలతోనే బయటపడేవారేమో! కానీ బైక్‌లు ఢీకొట్టుకొని.. వాటిపై ప్రయాణిస్తున్న ఏడుగురు కింద పడటం.. ఆ వెంటనే ఓ లారీ వేగంగా వారిపై నుంచి దూసుకెళ్లడంతో రోడుపై నెత్తురు చిమ్మింది. ఇద్దరు చిన్నారులు సహా ముగ్గురు అక్కడికక్కడే దుర్మరణం పాలయ్యారు. మరో నలుగురు గాయపడ్డారు. మెదక్ జిల్లా నర్సాపూర్ మండలం చిన్న చింతకుంట సమీపంలో మెదక్-హైదరాబాద్ హైవేపై శనివారం రాత్రి 7గంటలకు ఈ ఘోర ప్రమాదం సంభవించింది. మృతుల్లో తండ్రి, ఐదేళ్ల కుమారుడు ఉన్నారు. సమీప బంధువు కూతురైన ఎనిమిదేళ్ల బాలిక సెలవులకు వారింటికొచ్చి.. కూడా ప్రయాణం చేసి ప్రాణాలు కోల్పోయింది. మెదక్ జిల్లా కౌడిపల్లి మండలం వెంకట్రావ్‌పేటకు చెందిన మాల గోపాల్(30)కు భార్య పూజ, కుమారుడు అభినవ్(5), కూతురు ఆద్యశ్రీ ఉన్నారు. బొంతపల్లికి చెందిన గోపాల్ సమీప బంధువు కూతురు సహస్ర (8) ఇంటికొచ్చింది. వీరంతా శనివారం సాయంత్రం ఒకే బైక్‌పై వెంకట్రావుపేట నుంచి నర్సాపూర్‌కు బయలుదేరారు. అదే సమయంలో కంచన్‌పల్లికి చెందిన కరుణాకర్, వరమ్మ దంపతులు నర్సాపూర్ నుంచి బైక్‌పై బయలుదేరారు. చిన్నచింతకుంట సమీపంలో ఈ రెండు బైకులు ఎదురెదురుగా ఢీకొనడంతో అంతా కిందపడ్డారు. అదే సమయంలో మెదక్ నుంచి నర్సాపూర్ వైపు వస్తున్న లారీ వారిపై నుంచి వెళ్లింది. ఈ ఘటనలో గోపాల్, అభినవ్, సహస్ర తీవ్రగాయాలతో అక్కడికక్కడే మృతిచెందారు. పూజ, ఆద్యశ్రీ తీవ్రంగా, కరుణాకర్, వరమ్మ స్వల్పంగా గాయపడ్డారు. గోపాల్ ఒక కాలు శరీరం నుంచి వేరై.. కొంతదూరంలో పడింది. క్షతగాత్రులను నర్సాపూర్ ఆస్పత్రికి తరలించారు. పూజ, ఆద్యశ్రీ పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్ ఆస్పత్రికి తరలించారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు.



## సీసీకెమెరాలను ఏర్పాటు చేసుకోవాలి

- సంగారెడ్డి ఎస్పీ పంకజ్

సంగారెడ్డి క్రైం, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో శాంతి భద్రతల దృష్ట్యా వివిధ కుల, మతాలకు చెందిన పవిత్ర స్థలాలలో సిసి కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ శనివారం ఓ ప్రకటనలో సూచించారు. జిల్లాలోని ఆలయాలు, మసీదులు, చర్చిలు, కుల సంఘాల వద్ద కెమెరాలు, నెల రోజుల రికార్డింగ్ సామర్థ్యంతో కూడిన డీవీఆర్‌లు ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసులకు సహకరించాలని కోరారు. తప్పుడు ప్రచారం చేసినా, సోషల్‌మీడియాలో పోస్టులు చేసినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

# రజతోత్సవ సంబురం

(5వ పేజీ తరువాయి)

వ్యక్తం చేస్తున్నారు. అందుకే అంచనాల ప్రకారం జనాన్ని తరలించడంపై ఫోకస్ పెట్టారు. హుస్నాబాద్ నియోజకవర్గ పరిధిలోని ఎల్కతుర్తిలోనే సభ జరుగుతుండడంతో ప్రధానంగా ఈ నియోజకవర్గం నుంచే అధికంగా జనసమీకరణ చేయాలని భావిస్తున్నారు. పార్టీ అధినేత కేసీఆర్ ప్రాతినిధ్యం వహిస్తున్న గజ్వేల్, హరీశ్‌రావు ఎమ్మెల్యేగా ఉన్న సిద్దిపేట నియోజకవర్గాల నుంచి 25వేల మంది చొప్పున సభకు తరలించేలా వాహనాలు సమకూర్చారు. దుబ్బాక, నర్సాపూర్, పటాన్‌చెరు, సంగారెడ్డి, నారాయణఖేడ్, జహీరాబాద్, అందోల్, మెదక్ నియోజకవర్గాల నుంచీ 10 వేలకు తగ్గకుండా జనసమీకరణ చేయాలని టార్గెట్లు పెట్టారు. దీంతో ఆ దిశగా బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు, ఇన్‌చార్జిలు నిమగ్నమయ్యారు. సభ జరుగుతున్న ఎల్కతుర్తికి నారాయణఖేడ్, అందోల్, జహీరాబాద్, సంగారెడ్డి, నర్సాపూర్ నియోజకవర్గాలు 200 కిలోమీటర్ల దూరంలో ఉన్నందున ఉదయమే కార్యకర్తలు, ప్రజలు బయల్దేరే విధంగా ప్రణాళిక సిద్ధం చేస్తున్నారు.



### హరీశ్ టెలీకాన్ఫరెన్సులు

మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు రజతోత్సవ సభపై ప్రత్యేక దృష్టి సారించారు. పాదయాత్రకు శ్రీకారం చుట్టి బీఆర్‌ఎస్ శ్రేణులంతా సిద్దిపేట వైపు చూసేలా ప్రయత్నించారు. కార్ల ర్యాలీని ప్రారంభించి మరింత ఉత్సాహం నింపారు. ఇక ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ఇన్‌చార్జిలతో శనివారం పలుమార్లు టెలీ కాన్ఫరెన్స్‌లు నిర్వహించారు. మండలాలకు సంబంధించిన ముఖ్యనేతలు, మాజీ ప్రజాప్రతినిధులు, పార్టీ అధ్యక్షులతోనూ మాట్లాడారు. శనివారం ఉదయం ఎల్కతుర్తి సభా ఏర్పాట్లను పరిశీలించడానికి వెళుతూ కారులోనే టెలీకాన్ఫరెన్స్‌లతో పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. అనంతరం సిద్దిపేటకు వస్తూ మళ్లీ కాన్ఫరెన్స్‌లు మాట్లాడారు. రాత్రి సమయంలోనూ మరోసారి ముఖ్యనేతలు, ఎమ్మెల్యేలతో మాట్లాడి వాహనాల ఏర్పాట్ల గురించి ఆరా తీశారు.

### సిద్దిపేట గులాబీమయం

సిద్దిపేట మట్టిలో ఆవిర్భవించిన బీఆర్‌ఎస్ పార్టీ రజతోత్సవ సంబరాలు జరుపుకుంటున్న క్రమంలో పట్టణమంతా గులాబీమయమైంది. జంక్షన్లు, ప్రధాన చౌరస్తాలలో గులాబీ జెండాలు కట్టారు. తెలంగాణ ఉద్యమ ఫొటోలతో భారీ ఫ్లెక్సీలు వెలిశాయి. స్వరాష్ట్ర పోరాటానికి కేంద్ర బిందువుగా నిలిచిన సిద్దిపేటను పండగ వాతావరణం తలపించేలా ముస్తాబు చేశారు. సిద్దిపేట నుంచి బద్దిపడగ దాకా రహదారులపై బీఆర్‌ఎస్ నేతలు పెద్ద సంఖ్యలో స్వాగత తోరణాలు ఏర్పాటు చేశారు. సంగారెడ్డి, మెదక్ జిల్లా కేంద్రాలతోపాటు అన్ని నియోజకవర్గ, మండల కేంద్రాల్లో పార్టీ రజతోత్సవ ఫ్లెక్సీలు, వాల్‌పోస్టర్లు వెలిశాయి.

## సదరం క్యాంపును సద్వినియోగం చేసుకోవాలి

● జిల్లా గ్రామీణాభివృద్ధిశాఖ అధికారి

సిద్దిపేట కలెక్టరేట్, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): సదరం క్యాంపును దివ్యాంగులు సద్వినియోగం చేసుకోవాలని, క్యాంపు కోసం షెడ్యూల్ విడుదల చేయడం జరిగిందని జిల్లా గ్రామీణ అభివృద్ధి శాఖ అధికారి జయదేవ్ ఆర్యా శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మే నెల 8, 22 తేదీలలో క్యాంపు సిద్దిపేటలోని ప్రభుత్వ ఆసుపత్రిలో నిర్వహించడం జరుగుతుందని, క్యాంపుకు వచ్చే దివ్యాంగులు మీ సేవలో యూడీఐడీ పోర్టల్‌లో దరఖాస్తు చేసుకోవాలని ఆయన పేర్కొన్నారు.

## నేడు విద్యుత్ అంతరాయం

ములుగు, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): నేడు ములుగు మండలం బస్వాపూర్ గ్రామ పరిధిలో ఆదివారం ఉదయం 8 గంటల నుంచి 10 గంటల వరకు రెండు గంటల పాటు విద్యుత్ అంతరాయం ఉంటుందని విద్యుత్ ఏఈ శ్రీనివాస్ తెలిపారు. బస్వాపూర్ 11కేవీ మరమ్మతులు కారణంగా బస్వాపూర్ ఫీడర్ పరిశ్రమలకు సింగన్నగూడ, శ్రీరాంపూర్, అగ్రికల్చర్‌లకు రెండు గంటల పాటు అంతరాయం ఉంటుందని మరమ్మత్తులు పూర్తి అయిన తర్వాత యదావిధిగా కరెంట్ అందజేస్తామని తెలిపారు.

## కల్యాణలక్ష్మి చెక్కులు అందజేత



లబ్ధిదారుకు అందిస్తున్న ఆర్ఐ

మద్దూరు, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాల లబ్ధిదారులకు మంజూరైన కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను వారికి శనివారం అందించినట్లు ఆర్ఐ ముస్తాక్ అన్వర్ తెలిపారు. ఈ విషయమై ఆర్ఐ మాట్లాడారు. మండలకేంద్రమైన మద్దూరుకు-1, ధర్మారంకు-2, లద్నూరుకు-2, మర్మాముకు-3, లక్ష్మపల్లికి-1, రేబర్తికి-1 చొప్పున మంజూరయ్యాయన్నారు.

## సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలి

మద్దూరు, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): మే 20 జరిగే దేశ వ్యాప్త సార్వత్రిక సమ్మెను అన్ని రంగాల కార్మికులు జయప్రదం చేయాలని సీఐటీయూ మండల కమిటీ ఆధ్వర్యంలో శనివారం కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి కాముని వేణుగోపాల్ మాట్లాడారు. కేంద్రంలో మూడోసారి అధికారంలోకి వచ్చిన బీజేపీ నాయకత్వంలో ఎన్డీఏ ప్రభుత్వం కార్మిక ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తుందని విమర్శించారు. సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని కోరారు.

## జాతీయ రక్షణ నిధికి విరాళం

హుస్నాబాద్‌రూరల్, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): కశ్మీర్‌లోని పహల్గాం ప్రాంతంలో ఉగ్రదాడిలో అమాయక పర్యాటకులు ప్రాణాలు కోల్పోవడం అత్యంత బాధాకరమని ఈ సంఘటనపై పందిల్ల 5జీ టౌన్‌షిప్ నిర్వాహకులు శనివారం ఆవేదన వ్యక్తం చేశారు. దేశ రక్షణ కోసం జాతీయ రక్షణ నిధికి రూ.12వేలు విరాళంగా అందించారు. ఈ కార్యక్రమంలో సింగిల్‌విండో చైర్మన్ బొలిశెట్టి శివయ్య, సంస్థ నిర్వాహకులు శ్రీనివాస్ రెడ్డి, బండారి మహేందర్ పాల్గొన్నారు.

## బీఆర్ఎస్ పార్టీలో చేరిక



బీఆర్ఎస్‌లో చేరిన కాంగ్రెస్ కార్యకర్తలు

ములుగు, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): ములుగు మండలం శ్రీరాంపూర్ గ్రామానికి చెందిన కాంగ్రెస్ కార్యకర్తలు శనివారం మండల పార్టీ అధ్యక్షుడు జహంగీర్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు.

# యూజీసీ నీట్ పకడ్బందీగా నిర్వహించాలి

సిద్దిపేట కలెక్టరేట్, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): మే 4న యూజీసీ నీట్ పరీక్షను పకడ్బందీగా నిర్వహించాలని కేంద్ర విద్యాశాఖ, నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ అధికారులు సూచించారు. ఈ మేరకు శనివారం జిల్లా కలెక్టర్లతో న్యూఢిల్లీ నుంచి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి మే 4 న నిర్వహించనున్న యూజీసీ నీట్ పరీక్ష పగడ్బందీ నిర్వహణపై తగు సలహాలు, సూచనలు జారీ చేశారు. అభ్యర్థులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా పరీక్ష కేంద్రాలు ఏర్పాట్లు చేసి, అవాంఛనీయ సంఘటన జరగకుండా గట్టి పోలీస్ బందోబస్తుతో పరీక్ష నిర్వహించాలని సూచించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న జిల్లా కలెక్టర్ మను చౌదరి మాట్లాడుతూ.. జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన రెండు పరీక్ష కేంద్రాలను అన్ని విధాలుగా సిద్ధం చేసి ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పరీక్ష నిర్వహిస్తామని తెలిపారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో డీఈవో శ్రీనివాస్ రెడ్డి సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.




వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ మనుచౌదరి



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కేంద్ర విద్యాశాఖ, నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ అధికారులు

# 5 ఏళ్లు పూర్తి చేసుకున్న పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్చాలి

● అంతకంటే చిన్నవారిని అంగన్‌వాడీకి పంపాలి ● అంగన్‌వాడీ కేంద్రాల్లో గ్రాడ్యుయేషన్ డే

దౌల్తాబాద్,ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): 3 నుంచి 5 ఏళ్ల లోపు పిల్లలను అంగన్‌వాడీ కేంద్రాలకు పంపాలని, చిన్నారులకు పౌష్టికాహారం అందించి, ఆటలు, పాటల క్రమ శిక్షణతో కూడిన విద్యాభ్యాసం జరుగుతుందని ఐసీడీఎస్ దుబ్బాక ప్రాజెక్టు సీడీపీవో ఎల్లయ్య అన్నారు. శనివారం ఐసీడీఎస్ దుబ్బాక ప్రాజెక్టు సెక్టార్ల ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని వీఆర్ఆర్ గార్డెన్‌లో అంగన్‌వాడీ కేంద్రాల చిన్నారులకు పట్టభద్రుల దినోత్సవం నిర్వహించారు. ముందుగా జ్యోతి ప్రజ్వలన చేసి గ్రాడ్యువేషన్ డేను ప్రారంభించారు. ఈ సందర్భంగా సీడీపీవో ఎల్లయ్యతహసీల్దార్ చంద్రశేఖర్ మాట్లాడుతూ. ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా అంగన్‌వాడీ సెంటర్లలో ప్లే స్కూల్ విద్యను అందిస్తున్నారు. పేద సామాన్య ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, 3 సంవత్సరాల లోపు పిల్లను అంగన్‌వాడీ కేంద్రాలకు పంపాలని తల్లిదండ్రులను కోరారు. అనంతరం ఒకటో తరగతికి అర్హత పొందిన పిల్లలకు ధ్రువపత్రాలను అందజేశారు. గ్రాడ్యువేషన్ డే సందర్భంగా చిన్నారులు ప్రత్యేక దుస్తులు ధరించి ఆటపాటలతో అలరించారు. కార్యక్రమంలో ఎంపీడీవో వెంకట లక్ష్మమ్మ, తల్లిదండ్రులు, తదితరులు పాల్గొన్నారు.



వీఆర్ఆర్ గార్డెన్‌లో అంగన్‌వాడీ చిన్నారుల పట్టభద్రుల దినోత్సవంలో జ్యోతిప్రజ్వలన చేస్తున్న తహసీల్దార్ చంద్రశేఖర్, సీడీపీవో ఎల్లయ్య తదితరులు

## పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం



చిన్నారులకు గ్రాడ్యుయేషన్ సర్టిఫికెట్లు అందజేస్తున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్

సిద్దిపేట రూరల్,ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): గర్భిణులు, బాలింతలు మంచి పోషక విలువలతో కూడిన పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ వసంత అన్నారు. శనివారం నారాయణరావుపేట మండలం మాటిండ్ల గ్రామంలో పోషణ పక్షోత్సవాల కార్యక్రమంలో భాగంగా పిల్లలకు పౌష్టికాహార ప్రాముఖ్యపై అవగాహన, గ్రాడ్యుయేషన్ డే కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ సూపర్‌వైజర్ వసంత మాట్లాడుతూ అప్పుడే పుట్టిన శిశువుకు ముర్రుపాలు పట్టడంతో పాటు ఆరు నెలల వరకు తల్లిపాలు తాగించాలని చెప్పారు. ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహారం తప్పకుండా బాలింతలు, గర్భిణులు తీసుకోవాలని సూచించారు. వైద్యులు ఇచ్చే సూచనలు, సలహాలు తప్పకుండా పాటించాలన్నారు. ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా గర్భిణులకు, బాలింతలకు, చిన్నారులకు మంచి పౌష్టికాహారాన్ని అందజేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎఎన్ఎం మమత, అంగన్‌వాడీ కార్యకర్తలు బాలవ్వ లతా, ఆశవర్కర్లు, గర్భిణులు తదితరులు పాల్గొన్నారు.

## విద్యాధరిలో వైభవంగా శనిత్రయోదశి మహోత్సవం



శనైశ్చరుడికి తైలాభిషేకం

వర్గల్, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి) : వర్గల్ విద్యాధరి క్షేత్రంలోని శనైశ్చరాలయంలో శనివారం శనిత్రయోదశి వేడుకలు వైభవంగా నిర్వహించారు. ఆలయ వ్యవస్థాపకులు యాయవరం చంద్రశేఖర శర్మ సిద్దాంతి నేతృత్వంలో ఉదయం ఆలయ వేద పండితులు శనైశ్చరుడికి తైలాభిషేకాలు చేసి ఉత్సవాలకు అంకురార్పణ చేశారు. అనంతరం భక్తులు శనైశ్చరుడికి తైలాభిషేకాలు చేయడం కోసం ఆలయం వద్ద బారులు తీరారు. ముఖ్యంగా కుంభం, మీనం, మేషం, ధనస్సు, సింహ రాశుల వారు దోష నివారణ కోసం అధికంగా వచ్చారు.

## ఘనంగా రుద్ర శతచండీయాగం



శతచండీయాగం పూజలు చేస్తున్న నిర్వహకులు

చేర్యాల, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి) : చేర్యాల మండలం ఆకునూరు గ్రామంలోని భవాని రుద్రేశ్వరస్వామి దేవాలయంలో రుద్ర సహిత శతచండీయాగాన్ని శనివార ఘనంగా ప్రారంభించారు. ఈసందర్భంగా ఆలయంలో విశేషపూజలు నిర్వహించారు. గణపతి పూజ, యాగశాల ప్రవేశం, సర్వతోభద్రమండల దేవతా ఆవాహన, ప్రధాన కలశస్థాపన, అరణిమథనం జరిపారు. శతచండీ పారాయణం మూలమంత్ర హవనములు నిర్వహించారు.

## హుస్నాబాద్‌లో బీఆర్ఎస్ రజతోత్సవ సభ ర్యాలీ

హుస్నాబాద్, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి) : బీఆర్ఎస్ రజతోత్సవ సభకు సిద్దిపేట నుంచి పాదయాత్ర ద్వారా వెళ్తున్న బీఆర్ఎస్ శ్రేణులు శనివారం రాత్రి హుస్నాబాద్‌లో భారీ ర్యాలీ నిర్వహించారు. వీరికి స్థానిక బీఆర్ఎస్ నాయకులు స్వాగతం పలికారు. అనభేరి చౌరస్తా నుంచి హన్మకొండ రోడ్డులోని పెట్రోల్ పంపు వరకు డప్పు నృత్యాలు, డీజే పాటలు, బీఆర్ఎస్ నినాదాలతో హోరెత్తించారు. ఈ కార్యక్రమంలో జడ్పీ మాజీ వైస్ చైర్మన్ రాయిరెడ్డి రాజారెడ్డి, మాజీ ఎంపీపీ ఆకుల వెంకట్, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షులు ఎండి అన్వర్, పూదరి రవీందర్, వాల నవీన్‌రావు తదితరులున్నారు.

## రజతోత్సవాలతో బీసీ, ఎస్సీ, ఎస్టీలకు ఏం లాభం

సిద్దిపేట అర్బన్, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): రజిత ఉత్సవాలు నిర్వహించుకోవడం వల్ల బీసీ, ఎస్సీ, ఎస్టీలకు ఏం లాభం జరుగుతుందో తెలపాలని ధర్మసమాజ్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి కర్రోల్ల రవిబాబు అన్నారు. శనివారం సిద్దిపేటలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. దళితున్ని ముఖ్యమంత్రి చేస్తానని, అన్ని వర్గాల ప్రజలను ఆదుకుంటానని చెప్పిన కేసీఆర్ తాము అధికారంలోకి వచ్చిన తర్వాత అన్ని సామాజిక వర్గాలను కులవృత్తులకే పరిమితం చేసేలా కుట్రలు పన్నారని అన్నారు. బీఆర్ఎస్ పార్టీని బీసీ ఎస్సీ, ఎస్టీ ప్రజలు తిరస్కరించి పాతిపెట్టే రోజులు దగ్గర్లోనే ఉన్నాయని అన్నారు.



సమ్మర్ క్యాంపును పరిశీలిస్తున్న డీఈవో

## వేసవిలో విజ్ఞానం

(5వ పేజీ తరువాయి)

ఎంఈవోల ఆధ్వర్యంలో ప్రారంభం కూడా అయ్యాయి. జిల్లా విద్యాధికారి శ్రీనివాస్‌రెడ్డి, క్వాలిటీ సెల్ కోఆర్డినేటర్ బేతి భాస్కర్ పర్యవేక్షిస్తున్నారు. జిల్లాలో సుమారు 80 పాఠశాలల్లో సమ్మర్ క్యాంపులు కొనసాగుతున్నాయి. పది రోజులపాటు ప్రతీ రోజు ఉదయం 8 గంటల నుంచి 11 గంటల వరకు నిర్వహిస్తున్నారు. ప్రత్యేక కార్యక్రమాలతో విద్యార్థులను ఆకట్టుకునేలా కార్యక్రమాలు రూపొందించారు. ఇందులో చిత్రలేఖనం, చేతిరాతపై నైపుణ్యత, కనీస సామర్థ్యాలు, పద్యాలు, శ్లోకాలు, యోగా, ఏఐ ఆధారిత అంశాలు, ఇండోర్ గేమ్స్, సంప్రదాయ నృత్యాలు, నీతి కథలు నేర్పిస్తున్నారు.

### బడుల బలోపేతానికి ముందస్తు ప్రచారం

ప్రైవేటు విద్యాసంస్థలు ముందస్తుగా ప్రతీ ఏటా విద్యార్థుల కోసం ఆయా గ్రామాల్లో ప్రచారం నిర్వహించేవారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య తగ్గుతుండడంతో ఈసారి ప్రభుత్వ ఉపాధ్యాయులు ముందస్తుగా తమవంతు ప్రయత్నాలను ప్రారంభించారు. మేము సైతం అంటూ ముందుకు వచ్చి ముందస్తు బడిబాటలను ప్రారంభించారు. ప్రతీ ఏటా జూన్ మొదటివారంలో బడిబాటను నిర్వహిస్తుండగా, ఈసారి ఏప్రిల్‌లోనే చేపట్టారు. ప్రైవేటు స్కూళ్ల కంటే ముందుగానే గ్రామాల్లో బడిబాట కార్యక్రమాన్ని నిర్వహిస్తూ నమోదు కార్యక్రమాన్ని చేపట్టారు. ఉచిత పుస్తకాలు, మధ్యాహ్న భోజనం, పౌష్టికాహారం, దాతల సహకారంతో నోట్‌బుక్‌లు, షూలను అందిస్తున్నామంటూ ప్రచారాన్ని చేపట్టారు. ప్రభుత్వ నాణ్యమైన విద్యతో పాటు, ఏఐ బోధన అందిస్తున్నట్లు చెబుతున్నారు. ఇప్పటికే తల్లిదండ్రులను ఆకర్షించేలా చాలా పాఠశాలల్లో ప్రస్తుత విద్యా సంవత్సరంలో వార్షికోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ప్రాథమిక పాఠశాలలో సైతం గ్రాడ్యుయేషన్ డే కార్యక్రమాలను నిర్వహించి ఆకర్షిస్తున్నారు. వీటితోపాటు ప్రత్యేక రోజులు, పర్వదినాలను పాఠశాలల్లో ఘనంగా నిర్వహిస్తూ దగ్గరవుతున్నారు.



ముందస్తు బడిబాట నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు

# తడిసిన ధాన్యాన్నీ కొనుగోలు చేస్తాం





సిద్దిపేట రూరల్: తోర్నాలలో ధాన్యాన్ని పరిశీలిస్తున్న కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి హరికృష్ణ, రైతులతో మాట్లాడుతున్న రీజనల్ ట్రాన్స్‌పోర్టు అథారిటీ సభ్యుడు

సిద్దిపేట రూరల్, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): తడిసిన ధాన్యాన్ని చివరి గింజ వరకు ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని రైతులు అధైర్య పడవద్దని కాంగ్రెస్ పార్టీ సిద్దిపేట నియోజకవర్గ ఇంచార్జీ పూజల హరికృష్ణ భరోసానిచ్చారు. శనివారం సిద్దిపేట రూరల్ మండలం తోర్నాల, గ్రామంలో ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రంలో తడిసిన ధాన్యాన్ని పరిశీలించారు. ధాన్యం తరలించేందుకు లారీల సమస్య ఉందని రైతులు తెలపడంతో సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తామని హరికృష్ణ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ రాజేశం, ఏవో నరేష్, ఏఈవో గీతా, కాంగ్రెస్ పార్టీ జిల్లా మహిళ అధ్యక్షురాలు ముద్దం లక్ష్మి, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

### కొనుగోళ్లను వేగవంతం చేస్తాం

కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం కొనుగోళ్లు వేగవంతమయ్యేలా చూస్తామని రీజనల్ ట్రాన్స్‌పోర్టు అథారిటీ సభ్యుడు లక్కర్సు డాక్టర్ సూర్యవర్మ రైతులకు చెప్పారు. శనివారం సిద్దిపేట రూరల్ మండలం రావురూకుల, తోర్నాల గ్రామాల్లోని ఐకేపీ, పీఏసీఎస్ ధాన్యం కొనుగోలు కేంద్రాలను సందర్శించి సమస్యలను తెలుసుకున్నారు. అకాల వర్షాలతో ధాన్యం తడిసి రైతులు నష్టపోయే అవకాశం ఉన్నందున ధాన్యం సేకరణలో అలసత్వం చేయవద్దని అధికారులను కోరారు. తడిసిన ధాన్యం ఉంటే కొనుగోలు చేయాలని అధికారులకు సూచించారు.

● **నంగునూరు:** నంగునూరు మండలం నర్మెట్ట, మగ్దుంపూర్ కొనుగోలు కేంద్రాలను తహసీల్దార్ సరిత శనివారం తనిఖీ చేశారు. అకాల వర్షాలను దృష్టిలో పెట్టుకొని రైతులకు కనీస వసతులు కల్పించాలన్నారు. రైతులకు వ్యవసాయ శాఖ సిబ్బంది కూడా అందుబాటులో ఉండాలని ఆదేశించారు. వెంట వ్యవసాయ శాఖ విస్తరణ అధికారి తదితరులు ఉన్నారు.

## చట్టాలపై అవగాహన కల్పించిన షీటీమ్

గజ్వేల్, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): గజ్వేల్ మండల పరిధిలోని పీడీచెడ్ గ్రామంలో ప్రజలకు, మహిళలకు చట్టాల గూర్చి షీటీమ్ బృందం సభ్యులు అవగాహన కల్పించారు. శనివారం గ్రామంలో పర్యటించిన షీటీమ్ బృందం సభ్యులు మాట్లాడుతూ.. మహిళలకు అందుబాటులో ఎల్లప్పుడు షీటీమ్ బృందం ఉంటుందని, ఎవరైనా వేధింపులకు గురిచేస్తే వెంటనే డయల్-100కు ఫిర్యాదు చేయాలన్నారు. వివరాలు అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంటాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో షీటీమ్ ఏఎస్ఐ, మహిళా కానిస్టేబుళ్లు ఉన్నారు.

## రైతాంగ సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యం



మహిళా రైతులకు రోటవేటర్లను పంపిణీ చేస్తున్న మాజీ ఎమ్మెల్యే

గజ్వేల్, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): రైతాంగ సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని గజ్వేల్ మాజీ శాసనసభ్యులు తూంకుంట నర్సారెడ్డి అన్నారు. గజ్వేల్ డివిజన్ పరిధిలోని రైతులకు 14 రోటావేటర్లు మంజూరవగా, వాటిని గజ్వేల్ రైతువేదికలో శనివారం మహిళా రైతులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వ్యవసాయ యాంత్రీకరణలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం 50శాతం సబ్సిడీపై మహిళా రైతులకు వ్యవసాయ పనిముట్లను అందజేస్తుందన్నారు. ఆయనవెంట వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ వంటేరు నరేందర్‌రెడ్డి, తదితరులున్నారు.

### సీఎం సహాయనిధిని సద్వినియోగం చేసుకోవాలి

సీఎం సహాయనిధిని సద్వినియోగం చేసుకోవాలని గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే, డీసీసీ ప్రెసిడెంట్ తూంకుంట నర్సారెడ్డి అన్నారు. గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మునిసిపాలిటీ పరిధిలోని 3వ వార్డుకు చెందిన భూషన్నగారి రామకృష్ణాగౌడ్‌కు సీఎం సహాయనిధి ద్వారా మంజూరైన రూ.60వేల చెక్కును శనివారం ఆయన అందజేశారు. ఆయనవెంట నాయకులు మహ్మద్ షరీఫ్, ఊడెం శ్రీనివాస్‌రెడ్డి, శివులు తదితరులున్నారు

## దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయండి




ధూళిమిట్టలో మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా సహాయకార్యదర్శి రవికుమార్

ధూళిమిట్ట,ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్తంగా మే 20వ తేదిన జరగనున్న సార్వత్రిక సమ్మెను కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా సహాయకార్యదర్శి రవికుమార్ శనివారం మండల కేంద్రంలో జరిగిన సమావేశంలో పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గతంలో ఉన్న కార్మిక చట్టాలను కేంద్ర ప్రభుత్వం సక్రమంగా అమలు చేయకపోగా పూర్తిగా రద్దుచేసి వాటి స్థానంలో నాలుగు లేబర్‌కోడ్‌లను తెచ్చి పెట్టుబడిదారి, కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా రూపొందించిందన్నారు. ఈ లేబర్‌కోడ్‌ల వల్ల కార్మికులను బానిసలుగా చేయడం తప్పితే కార్మికులకు జరిగే లాభం ఏమిలేదన్నారు. కార్మికులకు నష్టం చేకూర్చే లేబర్‌కోడ్‌లను వెంటనే రద్దు చేయాలనీ డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ పోతిరెడ్డి రాజు, తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలల్లోనే పిల్లలను చేర్పించండి



చిన్నారికి ప్రవేశపత్రం అందిస్తున్న డీఈవో

చేర్యాల, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లోనే పిల్లలను చేర్పించాలని, ప్రైవేటు పాఠశాలల్లో చేర్పించి కష్టపడి ఆర్జించిన డబ్బులు దుబారా చేయవద్దని సిద్దిపేట డీఈవో శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. చేర్యాల మండలం కడవేరుగు గ్రామంలో శనివారం బడిబాట కార్యక్రమం ప్రారంభించిన అనంతరం పలు గ్రామాలలో ర్యాలీలు నిర్వహించారు. ఉన్నత విద్యార్హతలు, అనుభవం కలిగిన ఉపాధ్యాయులున్న ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య అందుతుందన్నారు. ప్రభుత్వ పాఠశాల ల్లో ఉచిత సౌకర్యాలు కల్పించడంతో పాటు డిజిటల్ తరగుతులు నిర్వహిస్తున్నామన్నారు. అనంతరం పలువురు విద్యార్థులకు ప్రవేశం కల్పించారు. కార్యక్రమంలో ఎంఈవో కిష్టయ్య, కడవేరుగు స్కూల్‌కాంప్లెక్స్ హెచ్ఎం చంద్రశేఖర్‌రావు, ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

## సాఫ్ట్‌బాల్ పోటీలకు ఎంపిక



సాఫ్ట్‌బాల్ క్రీడా పోటీల ఎంపిక పోటీల్లో క్రీడాకారులు

నంగునూరు, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): గట్ల మల్యాల ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో శనివారం సిద్దిపేట జిల్లా సాఫ్ట్ బాల్ క్రీడలకు క్రీడాకారుల ఎంపికను నిర్వహించారు. 11వ జూనియర్స్ ఇంటర్ డిస్ట్రిక్ సాఫ్ట్ బాల్ క్రీడలకు బాల బాలికలను ఎంపిక చేశారు. జిల్లాలో వివిధ మండలాల నుంచి ఈ ఎంపిక పోటీలకు వందమంది క్రీడాకారులు హాజరయ్యారు. వీరికి సాఫ్ట్ బాల్ క్రీడలో పోటీలు నిర్వహించి జిల్లా టీంలను ఎంపిక చేశారు. ఎంపికైన క్రీడాకారులు మే రెండవ తేదీ నుంచి నాలుగవ తేదీ వరకు జగిత్యాల జిల్లాలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలలో పాల్గొంటారని అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు నేతి కైలాసం, రేణుక తెలియ జేశారు. ఈ కార్యక్రమంలో సతీష్ కుమార్, దర్శనాల రాజ్ కుమార్, కోచ్ నవీన్, ఓం ప్రకాష్ రెడ్డి పాల్గొన్నారు.

## వక్ఫ్ చట్టం సవరణతో ఎవరికీ నష్టం లేదు



మాట్లాడుతున్న టీచర్స్ ఎమ్మెల్సీ కొమురయ్య

సిద్దిపేట క్రైం, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): వక్ఫ్ చట్ట సవరణ వల్ల ఎవరికి నష్టం లేదు. ఎవరు ఆస్తులు లాక్కోదని టీచర్స్ ఎమ్మెల్సీ మల్క కొమురయ్య అన్నారు. సిద్దిపేట జిల్లా కేంద్రంలోని టీఎన్జీవోస్ భవన్ లో వక్ఫ్ సంస్కరణల అవగాహన సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం సచార్ కమిటీ వేసిందని కమిటీ సూచనల మేరకు ఇప్పుడు వక్ఫ్ చట్ట సవరణ జరుగుతుందని తెలిపారు. వక్ఫ్ బోర్డులో ఇతరుల ప్రమేయం అని ఒక వర్గం దుష్ప్రచారం చేస్తున్నారని తెలిపారు. వక్ఫ్ ఆస్తుల పరిరక్షణకు పటిష్టమైన చట్టం రూపకల్పన చెందుతుందని తెలిపారు. అమాయక ప్రజలను పక్కదారి పట్టిస్తున్నారని తెలియజేశారు.